ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 23 | సంచిక : 12 | ఆగష్టు 2018

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V.
సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ|| 150/-
విడి ప్రతి : రూ|| 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

11-12-1983
జిన్నూరు
18-12-1983
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-12-1983, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పురాణం అంటే ఏమీ లేదు. పూర్వం జరిగినదానిని పురాణం అంటారు. దేనియందు అభిలాష లేకుండా నారాయణుడిని చింతించాలని భాగవతంలో చెపుతున్నారు. మీలో ఇక్కడ కూర్చున్న వారిలో ఎవరైనా ఒకే సమయంలో రెండు విషయాలని ఆలోచించ గలరేమో చూడండి. మీరందరూ ఆలోచించేది ప్రపంచం గురించి, ఇంద్రియాల గురించి, శరీరాన్ని గురించి, లేకపోతే భూతకాలం గురించి, భవిష్యత్తు కాలం గురించి, లోపల మీరు దొరకాలనుకునేది నారాయణుడు. శాస్త్రవిషయాలు చాలా సూక్ష్మాతిసూక్ష్మంగా ఉంటాయి. ఇంతకంటే సైన్సు నేర్చుకోవటం తేలిక - ఎదురుగా ఒక ఆబ్జెక్ట్ కనిపిస్తూ ఉంటే, ఆ వస్తువు గురించి ఆలోచిస్తూ ఉంటే, ఆ వస్తువుయొక్క రహస్యాలు మీ బ్రెయిన్‌కు తెలుస్తూ ఉంటాయి. మనకి సైంటిస్టుకి తేడా ఏంటంటే ప్రతీ వస్తువుని వాడు అబ్జర్వ్ చేస్తూ ఉంటాడు. మనం గుడ్డితనంగా చూస్తాము అంతే. మీరు అనుకునే బాహ్య కారణాలవల్ల జ్ఞానంరాదు. ఫలానా వ్యక్తికి ఫలానా కారణం వల్ల జ్ఞానం వచ్చింది అని అలా ఎవరినీ కొలవకండి. ఎవరికి ఎప్పుడు ఎందుకు ఇస్తాడో అది మనకు తెలియదు. ఒకోసారి ఈశ్వరుడు చేసే పనులు అలాగే ఉంటాయి. అడగటానికి, దావా చెయ్యటానికి వీలు లేదు. లక్ష్మిగారికి జ్ఞానం ఎందుకు ఇచ్చావు? ఆవిడకంటే నేనే ఎక్కువ సాధన చేస్తున్నాను అని అడగటానికి వీలు లేదు. అది ఆయన ఇష్టం. ఆయనని ప్రశ్నించటానికి మనకి హక్కు లేదు. మన జీవుడిని శరీరంలోంచి తప్పించి తీసుకుపోతున్నప్పుడు కూడా ఏంటి ఇప్పుడు తీసుకుపోతున్నావు అని అడగలేము. శాస్త్రాలు అర్థం చేసుకోవటం కష్టం; అసలు జ్ఞానిని కళ్ళతోటి చూసి ఆనందించవలసిందే కానీ ఏ జ్ఞానినీ అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యకండి. ఎందుచేతనంటే మీ మనస్సుకి ఆయన అందడు. ఊరికే మీ కళ్ళతోటి చూసి ఆనందించండి. మీ కొలతలకి దొరకడు, మీరు మనస్సుతోటి కొలుస్తారు. మనస్సుకి జ్ఞానం అందదు. అందుచేత కొలవటం మానండి. ఆధ్యాత్మిక విషయాలు ఎంతో సూక్ష్మంగా ఉంటాయి.

ఒక ప్లీడరుగారు భగవాన్ని ఒక ప్రశ్న అడిగారు. భగవద్గీత 18వ అధ్యాయంలో ఒక శ్లోకం ఉంది 'సర్వధర్మాన్ పరిత్యజ్య మాం ఏకం శరణం వ్రజ, అహంత్వా సర్వ పాపేభ్యో మోక్ష ఇష్యామి మా శుచః' - జీవలక్షణాలు అన్నీ విడిచిపెట్టి, నీ మనోవృత్తులు మనస్సు యొక్క చాపల్యం విడిచిపెట్టి నన్ను ఒక్కడినే శరణు వేడుకో, నిన్ను అన్ని పాపాల నుంచి విడుదల చేస్తాను అని పరమాత్మ చెప్పాడు. భయం రాగం కోపం అన్నీ మనస్సులో గుణాలు. ఇవన్నీ మనస్సు లక్షణాలు. వీటిని విడిచిపెట్టు, అప్పడు అన్ని పాపాల నుంచి నిన్ను విడుదల చేసి నీకు మోక్షాన్ని ఇస్తాను. అందుచేత నువ్వు దుఃఖపడకు, బెంగపెట్టుకోకు, నేను కదా నిన్ను రక్షించేవాడిని అని అభయం ఇస్తాడు స్వామి. ప్లీడరుగారు భగవాన్ని ఈ కండిషన్ ఏమిటండీ అని అడిగారు. అన్ని మనోవృత్తులు జీవలక్షణాలు విడిచిపెడితేనే, పాపాల నుంచి విడుదల చేస్తాడా? లేకపోతే చేయడా? ఇది పెద్ద మనిషి లక్షణమా? అంటే నా మనస్సులో గుణాలని విడిచిపెడితే కానీ నన్ను రక్షించడా ఆయన? నువ్వు ఇలా చేస్తే నేను ఇలా చేస్తాను అని కండిషన్ పెడుతున్నాడు, ఈ షరతులు ఏమిటి? భగవంతుడు కూడా షరతులు మాట్లాడుతున్నాడేంటి, అంటే నువ్వు అన్ని ధర్మాలని విడిచిపెడితే, జీవలక్షణాలు మనోవృత్తులు అహంకారం మమకారం ఇవన్నీ విడిచిపెడితే అప్పడు మమ్మల్ని ప్రేమిస్తాడా, ఆయన అనుగ్రహం మాకిస్తాడా ఇది ఏమన్నా పెద్దమనిషి తరహాగా ఉందా? అంటే ఇవి చెయ్యకపోతే ఆయన అనుగ్రహం మాకు ఇవ్వరన్నమాట, రక్షణ ఇవ్వరన్నమాట. అంటే వారు మమ్మల్ని ప్రేమించటానికి దోషాల నుంచి విడుదల చెయ్యటానికి ఈ కండిషన్ వారికి ఇవ్వాలన్న మాట. శరణాగతి పొందాలన్న మాట. ఇదేమన్నా న్యాయంగా ఉందా. అంటే మేము ఏదో చేస్తే వారు ఏదో చేస్తారన్న మాట. ఇదంతా వ్యాపారం క్రింద కనిపిస్తోంది అని ప్రశ్నించారు ప్లీడరు గారు. దానికి భగవాన్ సమాధానం ఇలా చెప్పారు - అది షరతు కాదు. ఈశ్వరానుగ్రహం ఎప్పడూ ఉంది. నువ్వు షరతులు పెట్టకపోయినా కూడా ఉంది. అసలు ఆయన అనుగ్రహం నువ్వు గుర్తించటం కోసం, ఆయన నీకు చేస్తున్న ఉపకారం నువ్వు అర్థం చేసుకోవటం కోసం, నీ మనస్సులో లక్షణాలు విడిచిపెట్టమన్నారు. కానీ నీ మనస్సులో ఆ లక్షణాలు ఉన్నప్పడు కూడా ఆయన అనుగ్రహం ఉంది. నీకు అర్థం అవ్వటం కోసం విడిచిపెట్టమన్నారు. అది కండిషన్ కాదు. మీకు కనీసం అది అర్థం అవ్వాలి కదా. మీకు సబ్జక్టు అర్థం అవ్వటం కోసం మీ మనస్సులో వృత్తులు విడిచిపెట్టమన్నాడు భగవంతుడు, కానీ మీ మనస్సులో ఆ వృత్తులు ఉన్నప్పడు కూడా ఆయన అనుగ్రహం మీమీద ఉంది. మీమీద ఆయన అనుగ్రహం ఎప్పడూ ఉంది, కానీ మీకు అర్థం అవ్వాలంటే శరణాగతి అయితేనే కానీ అర్థం కాదని చెయ్యమన్నాడు. ఎందుకు మిమ్మల్ని శరణాగతి చెందమంటున్నాడు, ఎందుకు సర్వ ధర్మాలని విడిచిపెట్టమంటున్నాడు అంటే ఆయన అనుగ్రహం మీ మనస్సుకి అర్థం అవ్వటంకోసం. అర్థం అయితేనే కానీ మీరు ఆచరించలేరు. ముందు అర్థం అవ్వాలి.

ప్లీడరుగారు కండిషన్ అనుకొంటున్నారు, అది కండిషన్ కాదు. ఈశ్వరానుగ్రహం ఎప్పడూ ప్రవహిస్తోంది. సూర్యుడు వెలుతురు ఇస్తున్నాడు, నువ్వు కళ్ళు మూసుకుని చీకటిగా ఉంది అంటే ఎలాగా? నువ్వు కళ్ళు మూసుకున్నప్పడూ వెలుతురు ఉంది, కళ్ళు తెరిచినప్పడూ వెలుతురు ఉంది. అయితే బయట వెలుతురు ఉందని గుర్తించటం కోసం కళ్ళు తెరవ మంటున్నారు అది కండిషన్ కాదు కదా? అని చెప్పారు. అప్పడు ఆ ప్లీడరు తల వంచాడు.

మనకి ఎన్నిసార్లు చదివినా భగవద్గీత అర్థం అవ్వటంలేదు. మన శరీరానికి ఒక పాముని చుట్టుకొని పైన బట్టలు వేసేసుకుంటే మనం పైకి బాగానే కనిపిస్తాము. కానీ లోపల అది చేసే పని చేసేస్తుంది. పైకి బట్టలు తెల్లగా బాగున్నాయి. లోపల పాముని చుట్టపెట్టుకున్నాము అది మీకేమి చేస్తుంది? అలాగే రాగద్వేషాలు లోపల ఉన్నాయి పైకి శరీరాలు కనిపిస్తున్నాయి. పాములు ఏం చేస్తాయో, రాగద్వేషాలు అదే చేస్తాయి. చివరికి జరిగేది అది. రాగద్వేషాలు మనల్ని కాటేయటం మానవు. ఈ ప్రకృతి మనల్ని విడిచిపెట్టదు. జన్మపరంపరలు విడిచిపెట్టవు.

చిన్న రహస్యం ఏమిటంటే ప్రాపంచిక సంబంధమైన అభిలాష కించిత్తు ఉన్నప్పటికీ మీ మనస్సు పరమాత్మవైపు తిరగదు. మీరు ఎవరిని ప్రేమిస్తున్నారు? చాలామంది డబ్బు సంపాదించుకుంటారు. డబ్బు మీద ప్రేమ లేకపోతే డబ్బు సంపాదించలేరు. మీరు అర్థం చేసుకోండి, డబ్బు మీద ప్రేమ లేనివాడు డబ్బుని సంపాదించలేడు. కొంతమంది కష్టపడి చదువుకుంటారు. చదువు మీద ప్రేమ లేకపోతే మీరు పిల్లవాడికి ఎంత నచ్చచెప్పినా వాడికి చదువు రాదు. డబ్బు సంపాదించాలన్నది వాడి హృదయంలోంచి రావాలి, బయటివాడు చెపితే ఎంతకాలం సంపాదిస్తాడు? వాడి హృదయంలోంచి రావాలి సంపాదించుకోవాలని. బయటివాడు బోటుపెడితే ఎంతకాలం నిలబడుతుంది? అది నిలబడదు. అలాగే పిల్లవాడికి నేను చదువుకోవాలని కుతూహలం వాడి హృదయంలోంచి వస్తే వాడు చదువుకుంటాడు కానీ, బయటి నుంచి నువ్వు చదువుకో చదువుకో అంటే ఎంతసేపు చదువుకుంటాడు వాడు? చదువుమీద ఎవడికైతే ప్రేమ ఉందో వాడు చదువుకుంటాడు. డబ్బుమీద ఎవడికైతే ప్రేమ ఉందో వాడు డబ్బు సంపాదించుకొంటాడు. ఇంకొంతమంది గౌరవాలు సంపాదించుకుంటారు. ఎందుకంటే ఈ మూట కూడా మోసుకెళ్ళవచ్చు కదా వెళ్ళేటప్పుడు అనుకుంటారు. మరి ఆత్మ మీద ప్రేమ ఎవరికి ఉంది? మీరు ఆలోచించండి. పైకి ఏమీ చెప్పవద్దు. మీలో ఆత్మమీద నిజంగా ప్రేమ ఎవరికి ఉంది? ఆత్మని తెలుసుకోవాలని ఎవరికి ఉంది? అసలు గమ్యస్థానానికి వెళ్తారా వెళ్ళరా అన్నది వదిలేయండి. ఆత్మని ప్రేమించకుండా మీరు ఆత్మని ఎలా పొందుతారు?

మీరు పదివేల రూపాయలు పెట్టి లక్షవత్తులపూజలు చేసే కంటే ఈ మాటలు ఒక అరగంటసేపు వింటే చాలు, అంతకంటే ఎక్కువ ఫలితాన్ని మీరు పొందుతారు. నేను ఇలా చెపితే మీలో ఎంతమందికి అర్థం అవుతుంది? సాధ్యమైనంతవరకూ మిమ్మల్ని నిజం దగ్గరకి తీసుకొని పోవాలని నా ఉద్దేశం కానీ నాకు భక్తిలేదని మీరెవరూ అనుకోవద్దు. భగవంతుడి మీద మీకెంత భక్తి ఉందో నాకూ అంతే భక్తి ఉంది. నా భక్తిని మీరెవరూ అనుమానించకండి. ధ్యానం చేస్తున్నారు కానీ ధ్యానం చేసేవాడిని ఎప్పుడైనా చూసారా మీరు? ముందు మన ఇంట్లో గొడవలు మనకి తెలియటంలేదు వీధిలో గొడవలు ఎందుకు మీకు? మీలో పూజ చేసేవాడు, ధ్యానం చెయ్యాలి అనుకొనేవాడు ఎవడు? వాడి గుట్టు ఎప్పుడైనా తెలుసుకొన్నారా మీరు? లోపల అవిద్య అజ్ఞానం ఉన్నాయి, వాటిని మాయ అంటున్నారు. లోపల ఉన్నదాని మాట ఏమిటి అని మీలో ఎవరికైనా ఆలోచన కలిగిందా? పురాణాలు గీత వింటున్నారు, భగవాన్ గురించి, రామకృష్ణుడి గురించి వింటున్నారు. రైటే, లోపల ఉన్న అజ్ఞానం కదిలిందా? జ్ఞానికి దుఃఖం కనబడదు. అజ్ఞానికి సుఖం కనబడదు. సూర్యుడికి ఎప్పుడైనా చీకటిని చూడాలని కోరిక కలిగినా చూడలేడు. ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడికి వెలుతురు వచ్చేస్తుంది.

మీచేత మననం చేయించటం కూడా నాకు ఇష్టంలేదు. శ్రవణమే చాలు మీరు ఇంటికి వెళ్ళి మననం చేయండి అనే మాటలు కూడా నేను అనను. రాముడు జ్ఞాని, కృష్ణుడు జ్ఞాని, రమణుడు జ్ఞాని, ఇటువంటి మాటలు చెప్పటానికి నేను ఇంత దూరం రావాలా? మీరు ఇంతదూరం వచ్చి కూర్చోవాలా? ఆవుబొమ్మ వేసి కింద ఆవు అని రాస్తేనే కానీ తెలియదా మనకి? మనం అందరం అన్నం తింటున్నాము. అన్నం ఒక్కటే సరిపోతుందా, ఇంకేం అక్కరలేదా మనకి? ఎంతసేపూ రూపదృష్టి నామదృష్టి. ఈ శరీరానికి ఒక రూపం ఉంది. దీనికో పేరు ఉంది. ఈ రూపం నేనుకాదు. ఈ పేరు నేను కాదు, కానీ ఈ రెండింటితో నేను కలిసాను. ఇంక ఇవి విడిచిపెట్టవు. ఎన్ని సాధనలు చేసినా విడిచిపెట్టలేను. రమణమహర్షి గురించి, రామకృష్ణుడిగురించి తరువాత అలోచించుదురుగాని, ముందు మన జాతకాలు చూసుకోవాలికదా! అసలు మన మనస్సు ఎందుకు చావటంలేదు? అహంకారం ఎందుకు చావటంలేదు? ఇక్కడికి రండి, కానీ అసలు రోగం ఏంటో తెలుసుకోవాలి కదా! ఈ శరీరం నాది, ఈ రూపం నాది అనుకొంటున్నాము. కొంతమంది చచ్చిపోయిన తరువాత ఎక్కడికి వెళ్ళిపోతాము. ఏమౌతాము అంటారు. నిద్దట్లో ఈ శరీరం ఏమౌతోంది. నిద్దట్లో ఎక్కడికి వెళ్తున్నారో మెలకువ వచ్చాక ఎక్కడినుండి వస్తున్నారో, చచ్చిపోయిన తరువాత అక్కడికే వెళ్తారు. రాత్రి నిద్రపోయేది చిన్నచావు. శరీరం పడిపోతే అది పెద్దచావు.

మీరు ఇప్పుడు ఆలోచించండి. ఎప్పుడో చచ్చిపోయిన తరువాత గొడవ ఎందుకు, నిద్ర పట్టడంలేదు అంటే, డాక్టర్ దగ్గర మాత్రలు పుచ్చుకోవటం ఎందుకు? నిద్రపట్టకపోతే అలా పడి ఉండరాదా? నిద్ర ఎందుకు కావాలి. పట్టకపోతే నష్టం ఏంటి? మనస్సు నిద్దట్లో ఆగుతుంది. అందుకు మీకు నిద్రబిళ్ళలు కావాలి. మనస్సు మీ సొంతం కాదు. అది ఎన్నో కోట్ల శరీరాలు సృష్టించింది. రాబోయే జన్మలలో ఎన్నో కోట్ల శరీరాలు తెస్తుంది. ఇదంతా మనస్సు చేష్టలే. డబ్బుని పుట్టించింది మనస్సే, డబ్బుకి బానిస అయ్యేది మనస్సే, చదువు నేర్చుకోనేది మనస్సే, నేను గొప్పగా చదువుకున్నాను అని గర్వపడేది మనస్సే, అధికారం సంపాదించి గర్వపడేది మనస్సే, అన్నీ మనస్సే. సంసారం కల్పించేది మనస్సే. సంసారం విడిచిపెట్టటంలేదు అని ఏడ్చేది మనస్సే. నరకానికి తీసుకెళ్ళేది మనస్సే, నరకం నుంచి బయటికి తీసుకొచ్చి సాధన చేసేది మనస్సే. శరీరం ఏమిచేస్తుంది పాపం. అది మొద్దు కూర్చోమంటే కూర్చుంటుంది. నడవ మంటే నడుస్తుంది. పరుగెట్టమంటే పరిగెడుతుంది. ఈ మనస్సుగురించి ఎప్పుడన్నా ఆలోచించారా మీరు? ఎందుకుఎదుటి వాళ్ళ గురించి ఆలోచించి మీ కాలాన్ని ఖర్చు పెట్టుకుంటున్నారు? మిమ్మల్ని మీ స్వార్థం చూసుకో మంటున్నాను. రాముడు, కృష్ణుడు క్షేమంగా ఉన్నారు, భగవాన్ క్షేమంగా ఉన్నాడు. మీ క్షేమం మాటేమిటి అదే నేను అడిగేది. మీరు కులాసాగా ఉన్నారా?

మీ శత్రువులు మిమ్మల్ని హింస పెడుతున్నారు అనుకొంటున్నారు. మీ అహంకారం మిమ్మల్ని హింస పెట్టినట్లుగా, ప్రపంచంలో ఎవరూ మిమ్మల్ని హింస పెట్టటంలేదు. మీ శత్రువులు కూడా మిమ్మల్ని హింస పెట్టటంలేదు. ఎందుకు గ్రహించరు మీరు ఈ విషయాన్ని? మీ అహంకారం మీ మనస్సు మిమ్మల్ని హింస పెట్టినట్టుగా మీ శత్రువులు కూడా మిమ్మల్ని హింస పెట్టలేరు. ఎందుకు అలా హింస పెట్టుకుంటారు మిమ్మల్ని మీరు? కొందరు

మనుషులు ఎలా ఉంటారంటే, ఒంటరిగా ఉన్నప్పుడు మిమ్మల్ని గౌరవిస్తారు. నలుగురిలో ఉన్నప్పుడు గౌరవించరు. ఆ గౌరవం కూడా అబద్ధం. అందుచేత గౌరవాలని నమ్మకండి. మనస్సు నిద్దట్లో కదలదు కాబట్టి నిద్ర కోసం మనకు బిళ్లలు కావాలి. జాగ్రదావస్థలో దానిని ఆపు చేయలేరు, స్వప్నంలో కూడా దానిని ఆపుచేయలేరు.

ఒకచోట ఉండి, ఒకచోట లేకపోతే అది జ్ఞానం అవుతుందా? జ్ఞానం లేని చోటు ఉంటేకదా. భగవాన్ కొండమీదకి వంటకి అన్నీ పట్టుకెళ్లారు. కాని అగ్గిపెట్టె మరిచిపోయారు. అప్పడు భగవాన్ అన్నారు. అన్నీ ఉన్నా అగ్గిపెట్టెలేదు వంటకి. అలాగే ఎన్ని ఉన్నా జ్ఞానం లేకపోతే మోక్షంరాదు. మిమ్మల్ని మీరు తెలుసుకోమని అడుగుతున్నాను. కానీ ఎదుటి వారిని తెలుసుకోమని అడుగుతున్నానా? మీరు పూజ చేసుకోమంటే తొందరగా చేసేసుకొంటారు. చందా ఇవ్వమంటే ఇచ్చేస్తారు. చందా ఇచ్చేస్తే మీ పని అయిపోయినట్టే అనుకొంటారు. కొంతమంది వ్యక్తులు అడగకుండా ఇస్తారు. కొందరు అడిగితే ఇస్తారు. కొందరు అడిగినా ఇవ్వరు. ఈశ్వరుడు అడగకుండా ఇచ్చే స్వభావం కలవాడు. మనం ఈశ్వరుడిని అది కావాలి, ఇది కావాలి అని అడుగుతాము. అంటే మనకి ఏది అవసరమో ఆయనకి తెలియదా? మీరు చెపితేనే కానీ ఆయనకి అర్థం అవ్వదా? మనస్సుని జయించాలి అంటారు, లేకుండా ఎక్కడ జయిస్తారు. ఋణం లేని మనిషికి ఋణం ఏం తీరుస్తాం? మనస్సు ఎక్కడ ఉంది, లేని మనస్సుని జయించి మీరు సాధించేది ఏమిటి? సాధన చేసేది ఏమిటి?

పూర్వం ఒక పంతులుగారు యజ్ఞానికి ఒక మేకని తోలుకెల్తున్నారు. ఆ మేకని కొట్టేయ్యాలని కొంతమందికి దుర్బుద్ధి పుట్టింది. వాళ్లలో వాళ్లు అనుకొని, ఏంటి కుక్కని తోలుకెళ్తున్నారు అన్నాడు ఒకడు పంతులుగారితో. ఇది కుక్కకాదు మేక, యజ్ఞానికి తోలుకెల్తున్నాను అన్నారు పంతులుగారు. కొంతదూరం వెళ్లాక ఇంకొకళ్లు మళ్లీ ఏంటి కుక్కని తోలుకెల్తున్నారు అన్నారు. ఇది మేక అని మళ్లీ పంతులుగారు చెప్పారు. ఇంకొంత దూరం వెళ్లాక మళ్లీ ఇంకో ఇద్దరు ఏంటి కుక్కని తోలుకెళ్తున్నారు. అది మేక కాదు కుక్క అన్నారు. అయ్యో నాకు తెలియలేదు అని పంతులుగారు దానిని వదిలేసారు. అది నిజంగా మేకే. కానీ ఇంతమంది అంటున్నారు. ఇది కుక్కే అయి ఉంటుంది అని పంతులుగారు దానిని వదిలేసారు. ఇలా ప్రతీ జన్మలో దేహం నేను, పేరు నేను అని ఇలా మనుషులు అంటున్నారు. నేను అనుకొంటున్నాను. మీరు అనుకొంటున్నారు. వాళ్లు కుక్కకుక్క అని మేకను కుక్క కింద ఎలా చేసేసారో అలాగే నేను ఆత్మ స్వరూపుడినైనప్పటికీ, నన్ను శరీరం కింద మనస్సు కింద తయారు చేసేసారు. పాపం ఆ పంతులుగారు ఏదో గంటసేపు నిలబెట్టుకున్నాడు. కానీ జనవాక్యం కదా పడిపోయాడు. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి ఇంటిలో వాళ్ల సహకారం ఉండదు. వీధిలో వాళ్ల సహకారం ఉండదు. ఎవరో ఏ రామకృష్ణుడికో చెల్లింది కానీ సహకారం, ఎవరికీ సహకారం ఉండదు. అయ్యో సాధన చేసుకొంటున్నారు, బాగా చేసుకోమని ఎవరూ చెప్పరు. దొరికితే ఏమైనా రెండు బెడ్డలు వేస్తారు. ఇది లోకానికి ఎదురీతలాంటిది. మనం డబ్బులు సంపాదించి ఇంటికి పట్టుకెళ్లి ఇవ్వటంలో ఉద్దేశం ఏంటంటే, తరువాత ఆ శరీరాన్ని మనస్సుని భార్యాబిడ్డలు బాగా చూస్తారు అని. వీధిలో వాళ్లకి పట్టుకెళ్లి ఇస్తే వాళ్లు ఏమీ చూడరు. అందుకే ఇంట్లో వాళ్లకి ఇస్తారు.

అక్కడ కూడా దేహమే కేంద్రం. వీడి దేహం కోసం భార్యకి బిడ్డలకి డబ్బు ఇస్తున్నాడు. వాళ్లకోసం కాదు, వీడిసుఖం కోసం పట్టుకెళ్లి ఇస్తున్నాడు. వాళ్లకోసం కాదు. వాళ్లు చూడరు అంటే ముందే ఇవ్వడు. వాళ్ళు చూసినా చూడకపోయినా వాళ్ళు చూస్తారని అనుకోవటం వాడి మనస్సుకి ఒక అలవాటు అయిపోయింది. చూడక పోయినా చూస్తారు, చూస్తారు అనుకొంటూనే చస్తాడు. ఎర్నింగ్ చేసేది అందుకే. భార్యమీద పిల్లలమీద ప్రేమ కాదు, వాడు శరీరాన్ని వాడు రక్షించుకోవటం కోసం ఇదంతా చేస్తున్నాడు. అబద్ధం కూడా దేహం కోసం అబద్ధం చెపుతాడు.

గౌరవంపోయిందని చాలామంది ఏడుస్తున్నారు. శవానికి గౌరవం ఏమిటండీ! లోపల ఆత్మని వదిలేసి శవానికి గౌరవం ఏమిటి? శరీరం లోపల ప్రాణం లేనప్పడు శరీరాన్ని ఎంత ముస్తాబు చేస్తే ఏముంది? అలాగే జ్ఞానంలేని జన్మకూడా అంతే. జ్ఞానంలేని జీవితం అంతే. అసలు సాధిస్తారా సాధించరా వదిలేయండి, జ్ఞానంయొక్క విలువ గుర్తింపు ఎవరికి ఉంది? ఈ లోకంలో ఎవరికి జ్ఞానం అక్కరలేదు, ఎందుచేతనంటే దాని విలువ ఎవరికీ తెలియదు అన్నాడు ఐన్‌స్టీన్. గౌరవం రాదని తెలిస్తే దానధర్మాలు కూడా ఎవడూ చెయ్యడు. జ్ఞానం కోసం ఎవరూ చెయ్యరు. మీరు చేసే దానాల వలన మనస్సు అణగాలి, మనస్సు అణగటంలేదు అనుకో ఇంక మీరు ఏంటి సాధించినట్లు చెప్పండి? మనస్సు అణగనప్పడు 100 సంవత్సరాలు బతికి ఏంటి సాధించేది? నాలుగు బస్తాల బియ్యం ఖర్చు తప్ప కలిసొచ్చేది ఏంటి. మనస్సు అణుగుతోందా అనేది చూసుకోండి! మనస్సు అణగకపోతే కోటి దేహాలు వస్తాయి. పూజలు, జపాలు, వ్రతాలు చిత్తశుద్ధికోసం పెట్టారు. కానీ వాటి పర్పస్ అంతా పోయింది. అది చివరికి ప్రాపంచిక వాంఛలలోకి దిగిపోయింది. తపస్సు అంటే ఏ హిమాలయాలకో అరుణాచలానికో పారిపోయి ముక్కుమూసుకొని కూర్చోవటం తపస్సు అనుకొంటున్నారు. మీరు ఇంటిదగ్గర కూర్చొని కూడా తపస్సు చెయ్యవచ్చు. మీరు భోగాలు తగ్గించుకోవటం తపస్సు, పుస్తకాలలో మాటలు చదివి కంగారు పడకండి, తపస్సంటే మీకుఅర్థం అవ్వక కంగారు పడుతున్నారు. తపస్సు అంటే ఇంటినుంచి పారిపోయి ఏ చెట్టు క్రిందో కూర్చొని కళ్ళు మూసుకోవటం అనుకొంటున్నారు. కళ్ళు మూసుకుంటే మనస్సుని ముయ్యగలమా? వైకుంఠం, మోక్షం వదిలేయండి. అసలు ఊరగాయని దాటగలమా? అందులో కొత్త ఊరగాయని అసలు దాటలేము? ఊరగాయనే దాటలేని వాళ్లము హిమాలయ పర్వతాలకి వెళ్లి మనం తపస్సు చేస్తామా?

జ్ఞానసూర్యుడు మీ హృదయంలో ప్రకాశిస్తూ ఉంటే కళ్ళు మూసుకోవటం ఏంటి, ముక్కు మూసుకోవటం ఏంటి, మీరు అన్నం తినేటప్పుడు సహజంగా తింటున్నారు, మీ భర్తని పిల్లల్ని ప్రేమించుకుంటున్నారు. దేవుడిని ప్రేమించమని మట్టుకు మీకు చెప్పాలి. మీ భర్తని పిల్లలని ప్రేమించమని, మీ సంసారంబాగా చూసుకోమని చెప్పక్కరలేదు. ఇదేమి గొప్ప వేదాంతం? ఒకరు చెపితే చేసేది ఎంతకాలం నిలబడుతుంది? కృష్ణుడో రాముడో ఎవరో ఒకరు వచ్చి చెప్పాలన్నమాట మీకు దేవుడిని ప్రేమించమని? శరీరానికి తిండి మేత, తిండి లేకపోతే శరీరం పడిపోతుంది. మనస్సుకి నామరూపాలే మేత. ఈ నామరూపాలే కొంపలు అంటించేస్తున్నాయి. మనస్సు ఎప్పుడూ ఏదో నామం గురించి రూపం గురించి ఆలోచిస్తుంది. తల్లో తండ్రో భర్తో పిల్లలో లేకపోతే స్నేహితుల గురించో ఆలోచిస్తుంది. మనస్సుకి నామరూపాలు మేత. ఎందుచేతంటే ఈ నామరూపాలని సృష్టించింది మనస్సే, దీనికి

ఇంకొకళ్ళు జత. ఆత్మని తెలుసుకొనే ప్రయత్నం తప్పించి శరీరానికి మనస్సుకి ఇంకో పనిలేదు. అది తప్పించి ఏ పని చేసినా ఒకటి లేని సున్నలు అన్నారు. దేహానికి అవసరమైన పనులు చేసుకొంటూ మిగతా టైముఅంతా జ్ఞానం సంపాదించటానికే ఖర్చు పెట్టమన్నారు. అంతకంటే ఎక్కువ ప్రకృతిలో పడ్డావా, నువ్వు ఉడతలా ఉండవు. ఎలుకలా ఉంటావు. ఉడతలకి తిండి పెడితే వాటికి కావలసింది తినేసి వెళ్ళిపోతాయి. ఎలుకలు అలా కాదు. కావలసినవి తినేసి మిగతావి పట్టుకెళ్ళి బొర్రలో పెట్టుకొంటాయి - అంటే సెక్యూరిటీ, రేపటికి రక్షణ. ఈ మాటలు భగవాన్ అన్నప్పుడు, అక్కడ ఉన్న ఒక ప్లీడరుగారు విని, ఉడతలమీద ఎలుకలు తెలివైనవి. రేపటి సంగతి కూడా చూసుకొంటున్నాయి కదా అన్నారు. అప్పుడు భగవాన్, తెలివైనవే అందుకే దౌర్భాగ్యపు జీవితం జీవిస్తున్నాయి అన్నారు. రేపటికి కనుక ఎలుక జాగ్రత్త పడుతూ ఉంటే దానికో ప్లాన్ ఉందికదా అన్నారు ఆ ప్లీడరు. అప్పుడు భగవాన్ ప్లాన్‌లేని వాళ్ళందరూ చచ్చిపోతున్నారా అన్నారు. సింహం దానికి ఆకలి వెయ్యకపోతే మనిషిని చంపదు. పులి అలాకాదు. ఎంతమందినైనా చంపేసి తిన్నంత తిని మిగతా శవాలని లోపల దాచుకుంటుంది. కానీ అడివికి రాజు పులికాదు సింహం.

మన హృదయంలో నిజంగా ఆత్మ ప్రకాశిస్తోంది. దానిని వదిలేసి రాముడు అనో, కృష్ణుడు అనో, ఏసు అనో, భగవాన్ అనో రామకృష్ణుడు అనో ఆలోచిస్తున్నాము. ఇంతకీ దీనిని తెలుసుకునే ధైర్యం లేక పారిపోతున్నాము. ఎవరికైనా సత్తాఉందా? మీరు ఆత్మని ఎందుకు ధైర్యంగా ఎదుర్కోలేరు? మీకసలు ఆ సత్తాయే లేదు. కొంతమందికి చదువు పెరుగుతుంది, డబ్బు పెరుగుతుంది, కానీ బుద్ధి పెరగదు. బుద్ధికి శుద్ధి లేకపోతే జ్ఞానం రాదు. శుద్ధిలేని బుద్ధి జ్ఞానాన్ని అందుకోలేదు. సాధన చెయ్యండి. ప్రయత్నం చెయ్యండి, ఇదే పెద్దలు అందరూ చెప్పేది. సాధన ఎలా ఉంటుందో మీరు ఎప్పుడైనా చూసారా? ప్రయత్నం చెయ్యమన్నా మనస్సుతోటే, అసలు మనస్సు ఉందా? సాధనచేసినా మనస్సుతోటే శరీరం కాదు కదా సాధన చేసేది. మనస్సు రహస్యం తెలుసుకోండి, ఇంకేమీ అక్కరలేదు. నాచేత ఎందుకు ఇన్ని మాటలు మాట్లాడిస్తున్నారు? మన చొక్కా మీద మచ్చ ఉంది అంటే కంగారుపడి పోతున్నారు. మరి మన ప్రేమలో మచ్చ ఉండవచ్చా? ప్రేమకూడా సహజంగా ఉండాలి. కోరికలు కోరుకోకుండా ప్రేమించాలి. మీరు కష్టపడి, ఎంతసేపు కూర్చోగలరు ఇక్కడ? మీ చుట్టాల ఇంట్లో కూర్చున్నట్లు కాదు. మన ఇంట్లో కూర్చున్నట్లు కూర్చోండి. భక్తి, ప్రేమ ప్రయత్నం చేసి ఎంతకాలం నిలబెట్టు కుంటారు? బోట్లు ఎంతసేపు నిలబెట్టుకుంటారు? ఎంతకాలం ప్రయత్నం చేసుకుంటారు? సహజంగా వచ్చేయాలి అది. ఎంతసేపు ప్రయత్నంతో ఉగ్గబెట్టుకోగలరు? మనకేదైతే సహజంగా ఉందో దానికోసం ప్రయత్నం చేస్తున్నాం. సాధన చేస్తున్నాం. దానిని ఒంటబట్టించు కోవాలి. మీరు తిన్న అన్నం అరిగితే రక్తంలా మారుతుంది. మీ శరీరానికి బలం ఉంటుంది. అరగకపోతే మీ పేగులు మీద ఏదో బరువు పెట్టినట్టు ఉంటుంది. మీరు ఒంటికి పట్టించు కోరేంటి? ప్రేమ, సాధనకూడా సహజంగా ఉండాలి. బరువు పెట్టినట్టుకాదు. ఎంతసేపు మోస్తారు బరువు? నా మనస్సుకి మాటకి నా చేతకి చుట్టరికం లేదు. ఏం చుట్టాలండీ ఇంక? భగవంతుడు మీకు చుట్టమా? మీ ఇంటికి అతిథి వస్తే లెక్కలు వేసుకొంటారు. ఎన్ని రోజులు ఉంటాడు అని, అలా భగవంతుడిని చూస్తారా మీరు? మీ ఇంట్లో బిడ్డ ఇవ్వాళ ఉంటాడా రేపు ఉంటాడా అని లెక్కలు

వేసుకుంటారా? చుట్టం అయితే లెక్క వేసుకొంటారు. భగవంతుడిని మీ ఇంట్లో ఒక భాగంగా మీరు చూడలేరా? పొద్దున ఇంతసేపు జపం చేసాను. మధ్యాహ్నం అంతసేపు, సాయంత్రం ఇంతసేపు పూజచేసాను అని డైరీలో రాసుకొంటారా? మరి మీ కుటుంబంకోసం ఎంత కష్టపడుతున్నారు అది రాసుకోరా? దానికిలెక్క అక్కరలేదా? వెఱ్ఱిలక్షణాలు కాకపోతే ఏమిటివి? మీరందరూ పెద్ద మనుషులా?

అసలు ఉన్నది ఒకటి, మనకి కనిపించేది వేరొకటి. అందుకే మనం మాయలో పడతాం. ఉన్నదాన్ని ఉన్నట్లుగా చూస్తే, లేనిది లేనట్లుగా తెలుస్తుంది. మనం ఉన్నదాన్ని లేనట్టుగా చూస్తున్నాం లేనిదానిని ఉన్నట్టుగా చూస్తున్నాం,.. అందుకే మాయలో పడుతున్నాం. నాకు ఆకలి వేస్తే అన్నం తింటున్నానుకదా. అప్పుడు అది త్యాగం ప్రేమ అనుకోవటం లేదు. సూర్యనారాయణ రాజు గారికి అన్నం పెడితే అది త్యాగం ప్రేమ అనుకొంటున్నాము. మనం అన్నం తిన్నప్పుడు మన బుద్ధి ఎలా ఉందో ఇతరులకి పెట్టేటప్పుడు కూడా అలాగే ఉండాలి. ప్రేమని త్యాగాన్ని విడిచిపెట్టమని కాదు నేను చెప్పేది. దాటమంటున్నాను. దాటలేరా? ప్రేమ త్యాగం కాదు, ముందు ఊరగాయని దాటండి. ద్వైతబుద్ధి వేరుబుద్ది ఉన్నంతసేపు మనస్సు మాయని దాటలేదు. దేవుడు వేరు, మీరు వేరు అనుకొన్నంతకాలం మీకు ఏదోటి అడగాలని పిస్తుంది. అడిగారంటే దొరికారన్నమాటే,.. మీరు ద్వైతబుద్ధికి దొరకకూడదు. జ్ఞానం కూడా ద్వైతజ్ఞానం పనికిరాదు. అద్వైతజ్ఞానమే పనికివస్తుంది. దూదిలోంచి దారం, దారంలోంచి చొక్కా వచ్చింది. కానీ దారాన్ని దూది అనము. చొక్కాని దారం అనము. చొక్కా అంటాము. ఆత్మలోంచే ప్రపంచం జీవుడు ఈశ్వరుడు వచ్చారు. కానీ ప్రపంచం ప్రపంచంగా, జీవుడు జీవుడుగా, ఈశ్వరుడు ఈశ్వరుడుగా కనిపిస్తున్నారు. ద్వైతబుద్ధిలో ప్రమాదం ఏంటంటే, దేవుడిని ఏదో ఒకటి అడగాలనిపిస్తుంది. వేరుగా కనిపిస్తున్నందువల్ల మీకు వేరుగా కనిపిస్తుంతకాలం భయం వేస్తుంది. మోహం పుడుతుంది. కోరిక పుడుతుంది. వేరుభావన ఉన్నంతకాలం బయాన్ని దాటలేరు. కోరికలని, మోహాన్ని, ప్రపంచాన్ని దాటలేరు. అసలు వాడి మనస్సుని వాడు దాటలేడు. ఏదో చెయ్యటంవల్ల వస్తే ఈపాటికి అందరూ సాధించేసేవారు. ఏదో చెయ్యటం వల్ల వస్తుంది అనుకోండి. మీరు అన్నం తినండి. ఆరోగ్యంగా ఉండండి అని నేను చెప్పవలసిన అవసరం లేదు. చెప్పకపోతే తినరా మీరు? ప్రపంచంలో మనుషులకి పుట్టినరోజు చేస్తారు కానీ, పుస్తకాలకి పుట్టినరోజు చెయ్యటం ఎక్కడా లేదు. ఒక్క భగవద్గీతకి తప్ప మళయాళస్వామి అనేవారు "మీరాత బాగోకపోతే గీత మీ చేతికి రాదని".

ఇల్లు మారినా, బట్టలు మార్చుకున్నా, మనస్సు మారదు. మీ దేహం మారినా, మనస్సు మారదు. నిగ్రహం కిం కరిష్యతి! తన స్వభావాన్ని జయించి బయటపడినవాడు ఎవడున్నాడు? నీ స్వభావాన్ని నిగ్రహించుకొని స్వభావాన్ని జయించాము అనుకొంటున్నావా? నిగ్రహం ఏం చేస్తుందయ్యా అన్నాడు వాసు దేవస్వామి. మనం ఎంత సాధన చేసినా మనస్సులో వంకర్లు అలాగే ఉంటాయి. కుక్కతోక లాంటిదది. కుక్కతోకని లాక్కుంటుంది వంకర పోతుందేమోనని, కానీ వదిలేశాక ఆతోక మళ్ళీ మామూలుగా వంకర తిరిగిపోతుంది. మీరు పూజ మీకోసం చేస్తున్నారా, ఎదుటి వాళ్ళు చూడాలని చేస్తున్నారా? మీరు పూజ చేస్తున్నారని ఎదుటివారికి ఎందుకు తెలియాలి. మీ పెట్టిలో ఎంత డబ్బు ఉందో ఎంత బంగారం దాచుకొన్నారో ఎవరికన్నా చెప్తారా? మీ బంగారం మాట, డబ్బు మాట ఎవరికీ

చెప్తారు కానీ, మీ భక్తి ఊరు అందరికీ చాటిస్తారా!

మీ శరీరంలో ఉన్న భాగాలు లాగానే, జ్ఞానం కూడా మీలో ఒక భాగమే. మీరు భోగం అనుభవంచేటప్పడు భోగం పూర్తి అయితే దానివలన ప్రమాదం లేదు. కానీ భోగం అనుభవించిన స్మృతి మట్టుకు మనస్సులో అలా ఉండిపోతుంది. అది వచ్చే జన్మలలో కూడా మనస్సుని ఆత్మవైపు తిరగనివ్వదు. ఈ భోగాన్నే కోరుతుంది అన్నారు. భోగం అనుభవించాక మనస్సులో స్మృతి ఉంటుంది. ఆ స్మృతిమళ్లీ భోగాన్ని సంపాదించు అంటుంది. కనీసం ఆత్మని తెలుసుకుందాము సాధన చేద్దాము అనే ప్రయత్నం వైపు కూడా నీ మనస్సుని తిరగనివ్వదు ఆ భోగం. మీ ఇంద్రియాలతో పేచీలు పెట్టుకోవద్దు. గొడవలు అనవసరం. గొడవలు పెంచుకోకండి. మీ ఇంద్రియాలకి నచ్చచెప్పండి. వాటికి అర్థం అయ్యేలా చెప్తే అవేమీ గొడవ చెయ్యవు. వాటికి అర్థం అవ్వకపోతే ఎదురు తిరిగి ఎప్పటికైనా మీ ఇంద్రియాలు మీమీదే కక్షతీర్చుకుంటాయి. అర్థం అయ్యేలా చెపితే మీమీదకి రావు. వాటికి అర్థం అవ్వకుండా బలవంతాన అలా నొక్కిపెట్టి ఉంచితే ఎప్పడో ఒకప్పడు తిరగబడి మీమీద కక్ష తీర్చుకుంటాయి. అణిచిపెట్టిన మనస్సు పగపట్టిన త్రాచుపాములాంటిది. పగపట్టిన త్రాచుపాము ఎప్పటికైనా మనం అజాగ్రత్తగా ఉన్నప్పడు చూసి కాటు వేస్తుంది. మనస్సు అంటే ఏమిటి. ఇంద్రియాలు అంటే ఏమిటి. అర్థం చేసుకొని వాటిని పడగొట్టాలి. చచ్చిన మనస్సు ఏమీ చెయ్యలేదు. అణిచిపెట్టిన మనస్సు ఎప్పటికైనా దెబ్బతీస్తుంది.

భగవంతుడిని ప్రేమించి ఆ ప్రేమలో మీ దేహాన్ని, మీ మనస్సుని, మీ ఇంద్రియాలని మరిచిపోలేరా? అంత ప్రేమ లేదా? మీ మనస్సు, దేహం, ఇంద్రియాలు జ్ఞాపకం వస్తుంటే వాటిని జయించటం అనే సమస్య వస్తుంది. మీ దేహాన్ని మరిపించే ప్రేమ కానీ, మీ ఇంద్రియాలని మరిపించే ప్రేమ కానీ, మీ మనస్సుని మరిపించే ప్రేమ కానీ మీలో ఎవరికీ లేదా? ప్రేమలో కరగని ఇంద్రియాలు కానీ, ప్రేమలో కరగని మనస్సు కానీ, ప్రేమలో కరగని దేహం కానీ ఉంటాయా. భగవంతుని ప్రేమలో ఈ శరీరం, ఇంద్రియాలు, మనస్సు కరిగిపోతుంటే, ఇంక ప్రపంచం ఎక్కడిది జయించటానికి? కుందేటికి అసలు కొమ్ములే ఉండవు. లావుగా ఉంటాయా, సన్నగా ఉంటాయా అనుకోవటంలో అర్థం ఏమిటి? మన ఇంట్లో బాధల వల్ల మనం ఎంత దుఃఖపడ్డామో, ఎన్ని కడవల నీళ్ళు వచ్చాయో. అలా భగవంతుడికోసం ఎప్పడయినా దుఃఖపడ్డామా, ఒక్క గ్లాసుడు నీళ్ళు అయినా వచ్చాయా? గోపికలకి ఏమైనా డాక్టరేట్లు ఉన్నాయా, లేకపోతే యూనివర్సిటీలోనో కాలేజీలోనో చదువుకున్నారా? ఇంకా అర్జునుడు నా రథం తోలమని ఇలాంటివి ఏవో అడిగాడు. ఏ గోపికైనా కృష్ణుడిని నాకీ ఉపకారం చేసిపెట్టమని అడిగిందా? నువ్వు గోకులం విడిచిపెట్టి వెళ్ళకు, నువ్వు మా కళ్ళ ఎదురుగా కనపడు. నీ దగ్గరనుంచి మేము ఏమీ వాంఛించటం లేదు. వాళ్ళు మోక్షం అడగలేదు. ప్రేమ అడగలేదు. పారమార్థిక స్వర్గం కానీ, భౌతికానికి సంబంధించినది కానీ ఏమీ అడగలేదు. ఈ భూమికి సంబంధించిన మైకం వారిలో లేనేలేదు. బ్యాంకులో డబ్బులు, ఎకరాలు, రూపాయలు లేవు, గౌరవాలులేవు. ఏదైతే మీరు మనస్సుతోటి సంపాదించుకొంటున్నారో ఇవన్నీ మళ్ళీ ఈశ్వరుడిని తెలుసు కోవటానికి అడ్డు వస్తాయి. నేను ఒక వ్యక్తిని. నాకు ప్రపంచం వేరుగా ఉంది. ఈ శరీరం లోపల నేను ఉన్నాను అని ఏదైతే ఈ మనస్సుతోటి స్మరిస్తున్నారో ఈ స్మరించేవి అన్నీ, మీ భావాలు అన్నీ, మీరు భగవంతుడిని తెలుసుకోవాలి అనుకొన్నప్పడు మీకు ఎదురువచ్చి నిలబడతాయి.

మీ ఆలోచనలే మీ తలంపులే మీ కోరికలే మీ ఊహలే మీకు అడ్డువచ్చి నిలబడతాయి. బయటవారు ఎవరూ అడ్డుగా నిలబడరు.

ఒక పెద్దమనిషి నాన్నగారిని అడిగారు. మనం ఏ పని చేసినా ఏదో ఉద్దేశం పెట్టుకొని చేస్తాము కదా. అన్నం తినటానికి వండుకుంటున్నాము. చదువు ఉద్యోగం కోసం చదువుతాము! డబ్బు సంపాదిస్తే భోగం అనుభవించవచ్చు అనుకొంటాము. ఏ పని చేసినా ఉద్దేశం ఉండాలి కదా. కానీ భగవద్గీతలో ఫలితాన్ని దృష్టిలో పెట్టుకోకుండా పని చేయమన్నారు కదా. అది ఏం పద్ధతి అని అడిగారు? ఎంత లాజిక్ చెప్పాడో చూడండి. పైకి పెద్దమనిషి తరహాగా చెప్పినా లోపల దురుద్దేశం ఉంది. కృష్ణుడు చెప్పినవన్నీ పిచ్చి మాటలు అని వాడి ఉద్దేశం అన్నమాట. ఫలితం లేకుండా పని చేసినవాడిని వెర్రివాడు అంటున్నాం. కృష్ణుడు కూడా అటువంటివాడేకదా అని మనల్ని అడగటం అన్నమాట. దానికి నాన్నగారి సమాధానం - ఫలితాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే ఆ ఫలితమే వస్తుంది - ఆ ఇల్లో ఆ డిగ్రీయో లేకపోతే ఆ రూపాయో వస్తుంది. ఇక్కడ చిన్న రహస్యం మీరు మనస్సులో పెట్టుకోండి. కృష్ణుడు విడదీసి చెప్పలేదు. అది మనం అర్థం చేసుకోవాలి. ఫలితాన్ని దృష్టిలో పెట్టుకోకుండా చేస్తే ఏమీ రాదని అనుకోకండి - జ్ఞానం వస్తుంది. ఫలితాన్ని దృష్టిలో పెట్టుకోకుండా పని చెయ్యమన్నాడు కానీ ఫలితాన్ని ఇవ్వనని కృష్ణుడు గీతలో 18 అధ్యాయాలలో ఎక్కడా చెప్పలేదు. ఆయన జ్ఞానాన్ని ఇస్తాడు. జ్ఞానం వల్ల మోక్షం వస్తుంది. అంతకంటే ఏముంది ఈ భూమిమీద కోరుకొనేది! మీకు ఏది మంచిదో మీకెక్కువ తెలుసా, కృష్ణుడికి ఎక్కువ తెలుసా? బిడ్డకు ఏది మంచిదో తల్లికంటే బిడ్డకి ఎక్కువ తెలుసా? తల్లికి ఎక్కువ తెలుసా? మీ గురించి భగవంతుడికి ఎక్కువ తెలుసా? మీకు ఎక్కువ తెలుసా? మీరు ఫలితాన్ని కోరుకోకుండా పని చేస్తే మీకు జ్ఞానాన్ని ఇస్తాడు. భౌతిక అవసరాలూ తీరుస్తాడు. రెండు ఉపకారాలు చేస్తాడు. మీరు కోరుకొంటే కోరుకున్నది రావచ్చు. మిగతాది రాదు. గీతలో చెప్పినట్టు నడుచుకొంటే మీరు జ్ఞానాన్ని కోరనక్కరలేదు. జ్ఞానంవరించి వచ్చి మీమీద పడుతుంది. మీరు కోరుకోవటం కాదండీ! మీరు జ్ఞానాన్ని వరించటం కాదు. జ్ఞానం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. నాకు మోక్షం కావాలి అనుకొనే వాడికెవ్వడికీ ఈశ్వరుడు మోక్షం ఇవ్వడటండీ. ఈశ్వరుడు ఎవరిని ప్రేమిస్తున్నాడో వాళ్ళకే ఇస్తాడటండీ మోక్షం. మీరు ఈశ్వరుడిని ప్రేమించటం కాదు. ఈశ్వరుడు మిమ్మల్ని ప్రేమిస్తున్నాడా! మీరు అనుకోవచ్చు మాకు ఎంతోకొంత భక్తి ఉంది అని, కానీ ఈశ్వరుడు మిమ్మల్ని ప్రేమిస్తున్నాడా! మీ అహంకారం ఏంటి, మీరు స్మరించటం ఏంటీ? ఈశ్వరుడు ఒక్కసారి ఆయన హృదయంలో మిమ్మల్ని స్మరిస్తే మిమ్మల్ని ఆత్మసామ్రాజ్యం మీద కూర్చోపెడతాడు.

అహంకారం రోజుకి 90అవతారాలు ఎత్తుతుంది. పొద్దున్న ఒకటి, సాయంత్రం ఒక రకం, భగవంతుడిని స్మరించే శక్తి అహంకారానికి ఎక్కడ ఉంది? మీరు స్మరించటం కాదు ఆయన మిమ్మల్ని స్మరించాలి. ఆయన ఎవరిని స్మరిస్తాడు? ఎవరిమటుకు వాళ్ళు మేము గొప్పవాళ్లం, మా ప్రవర్తన బాగుంది, మేము తెలివైనవాళ్ళం అనుకొంటారు. పైకి చెప్పకపోయినా లోపల అనుకొంటారు. ఇక్కడ కూర్చున్న వాళ్ళలో ఎవరినైనా మీరు తెలివితక్కువవాళ్లు అంటే ఊరుకుంటారా? ఆయనకి ఎవరి ప్రవర్తన అయితే నచ్చిందో అక్కడ ఆయన మీకుఇచ్చే బహుమానం మోక్షం, జ్ఞానం. భక్తులదగ్గరికి వచ్చేసరికి వాడంటే చాలాఇష్టం. వీడంటే ప్రీతి, ఇలా మాటలు చాలా చెప్పాడు. జ్ఞానిదగ్గరకి వచ్చేసరికి అలా

అనలేదు. ఇష్టం అనలేదు. వాడికీ నాకూ తేడా లేదు. వాడు నా స్వరూపమే అన్నాడు. జ్ఞానంతో సమానమైనదే లేనప్పుడు జ్ఞానంకంటే గొప్పది ఎలా ఉంటుంది. జ్ఞానం దగ్గరకి వచ్చేసరికి కృష్ణుడు పొంగిపోయాడు. వాడు నాకు ఇష్టం అని చెప్పలేదు. ఇష్టుడు అంటే ద్వైతం వచ్చేస్తుంది. వేరుభావన వస్తుంది. వాడే నేను అన్నాడు. జ్ఞానికి నాకు మధ్య తేడా చూడకు అన్నాడు. జ్ఞాని నా స్వరూపం అన్నాడు. ఆ అగ్రస్థానం ఒక్కజ్ఞానికే ఇచ్చాడు.

**హే భగవాన్, జయ భగవాన్, ప్రియ భగవాన్, ప్రభు భగవాన్!**

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - జిన్నూరు 18-12-1983

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు ధ్యానంకంటే మాటలే ఎక్కువ వినిపిస్తున్నాయి. మీరు అరగంటో గంటో ధ్యానంలో కూర్చున్నారనుకోండి. మీరు సహజంగా కూర్చున్నారా, అసహజంగా కూర్చున్నారా, మీరే ఆలోచించుకోండి. పైకి చెప్పక్కరలేదు. ప్రయత్నం చేస్తున్నట్టు కూర్చున్నారా. లేకపోతే మామూలుగానే కూర్చున్నారా? సహజం కానిది ప్రతీదీ అబద్ధమే. ఏదైతే సహజం కాదో అది అంతా కృత్రిమం. మీరు బిగపట్టేసి కూర్చోనక్కరలేదు. మీరు సహజంగా కూర్చుంటే, అలా మీరు సాయంత్రం వరకూ కూర్చున్నా మీకేమీ వేవరింగ్‌రాదు. కానీ దీనికి ధ్యానం అని పేరు పెట్టేసారు. ఆ పేరు దగ్గర మీ మనస్సులు ఆగిపోతున్నాయి.

మనం సాధించేది ఏమిటో కనపడటంలేదు. మనం సాధించటానికి ఏముంది. అందరూ సుఖం కోసమే స్వార్థం కోసమే పనిచేస్తున్నారు. మనందరికీ సుఖం కావాలనుంది. మనం సుఖాన్నే ఎందుకు కోరుకొంటున్నాము. దుఃఖం ఎందుకు కోరుకోకూడదు. దానికి సమాధానం మీరు చెప్పండి. శరీరానికి అన్నం పెడుతున్నారు. మెదడుకి మేత పెట్టరా? ఎందుకు సుఖం కోరుకుంటున్నామంటే మన స్వరూపంలో సుఖం ఉంది. మన స్వరూపం సుఖస్వరూపం, దుఃఖస్వరూపం కాదు. మీరు సుఖం కోరుకుంటున్నారంటే మీకు తెలియకుండా మీ స్వరూపాన్నే కోరుకుంటున్నారు. మీకు తెలియకపోయినా మీరు ఆత్మనే కోరుకుంటున్నారు. హేతువాదులైనా అంతే, ఆస్తికులైనా నాస్తికులైనా అంతే, హేతువాదులకి సుఖం అక్కరలేదా? దేవుడు లేడు అని చెప్పేవారికి దేవుడు ఉన్నాడు అని చెప్పేవారికీ సుఖం కావాలి. మీరు సుఖం కోరుకుంటున్నారు అనుకుంటున్నారు. మీకు తెలియకుండా మీ స్వరూపం వైపే మీరు ప్రయాణం చేస్తున్నారు. మీ స్వరూపం దుఃఖం అయితే మీరు దుఃఖాన్నే కోరుకొంటారు. హేతువాదం మనస్సులోనే పుట్టింది. దేవుడు లేడు, దేవుడు ఉన్నాడు అని చెప్పే మాటలన్నీ మనస్సులోనే పుట్టాయి. ఇది దాటితేనే కానీ మనకి ఆత్మ తెలియదు. అసలు ఎన్ని జన్మలు ఎత్తినా మనం మనస్సునే దాటలేకపోతున్నాము. దేవుడు లేడని వాదించేవాడికి దేవుడు గురించి తెలియదు. దేవుడు ఉన్నాడని చెప్పేవాడికి దేవుడు గురించి తెలియదు. ఇద్దరికీ తెలియదు. కానీ ప్రతీజీవుడూ సుఖాన్ని కోరుకుంటాడు. మనుషులు జంతువులు దేవతలు అందరికీ సుఖం కావాలి. సుఖాన్ని కోరని జీవిని చూసారా? సుఖంపేరుమీద మన స్వరూపాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. అందరికీ సుఖం కావాలి. అయితే ఆ సుఖం ఎందులో ఉందో తెలియదు. ఏదో ఒక వస్తువులో సుఖం ఉందనుకొంటాడు. దానికోసం కష్టపడతాడు. దానిని సంపాదించాక తెలుస్తుంది అందులో సుఖం లేదని అది వదిలేసి ఇంకో వస్తువు కోసం ప్రయత్నం చేస్తాడు.

అందులో ఏదో సుఖం ఉందనుకుని దాని గురించి కష్టపడి, జన్మలు ఖర్చుపెట్టి సాధిస్తాడు. అందులో కూడా సుఖం లేదని తెలుస్తుంది. విడిచేస్తాడు. ఒక మనిషి ఇంకో మనిషిని చంపితే వాడి సుఖం కోసం చంపుతున్నాడు. ఆ చంపటంలో కూడా సుఖాన్ని కోరుకుంటున్నాడు. లేకపోతే ఎందుకు చంపుతాడు? కానీ ఆ సుఖం రాకపోవచ్చు. డబ్బు సంపాదన, విద్య సంపాదన, ఏ కళ సంపాదించినా మొత్తం వాడి సుఖం కోసమే ప్రయత్నం చేస్తున్నాడు. తల్లిదండ్రులు కూడా చెపుతారు. బాగా చదువుకో అబ్బాయీ, పెద్ద ఉద్యోగాలు చేస్తే సుఖపడతావు అని. మానవుడి ధ్యేయం తను సుఖంగా ఉండాలి అని. అయితే సుఖం తన స్వరూపమే అన్న సంగతి వాడికి తెలియదు. మనం దైనందిన జీవితంలో దుఃఖం వచ్చే పనులు చేస్తాము. సుఖం కోరతాము. మనస్సుని జయించాలి అనికదా శాస్త్రాలు చెప్పేది. అసలు మనస్సు అనేది ఒకటి ఉందంటే. జయించవచ్చు. అది ఎక్కడ ఉందో అసలు ముందు చూడండి. అసలు మనస్సు అనే ఒక వస్తువు ఉంటే తరువాత జయించటం, అది ఎక్కడ ఉందో చూడండి. సంకల్పం లేకుండా ఎవరూ ఉండరు. సంకల్పం నేనా, సంకల్పం ఆత్మా? సంకల్పమే మనస్సు అన్నారు. అక్కడ మనం చాలా దూరం మన పుట్టిల్లు వదిలేసి వచ్చేసాము. శాస్త్రంలో చెప్పారు సంకల్పమే మనస్సు అని. సంకల్పం నేనా? కోపమే నేనైతే 24గంటలు నాతో ఉండాలి కదా.

కోపాన్ని విడిచిపెట్టమనటం లేదు నేను. కోపాన్ని అర్థం చేసుకోమంటున్నాను. కోపం నేనైతే 24గంటలు నాతో ఉండాలికదా. దేహమేకనుక నేనైతే ఎందుకు మరణిస్తోంది అది. ద్వేషం నేనైతే ఒక మనిషి మీద ద్వేషం పుట్టింది అనుకోండి. ఇవ్వాళ ఉన్న ద్వేషం రేపు ఎందుకు ఉండటం లేదు. ఇంజక్షన్ చేసినప్పుడు ఎంత నొప్పి ఉంటుందో ఆమాత్రం నొప్పి కూడా లేకుండా మీకు ఏమీ శ్రమ లేకుండా ఆత్మ దగ్గరికి తీసుకెళ్ళాలని నా ప్రయత్నం. మీరెవరూ సాధనలు చెయ్యనక్కరలేదు. నేనే చేస్తాను. మీరు సాధనల పేరు చెప్పి గందరగోళం పెట్టుకోకండి. మీరెవరూ సాధనలు చెయ్యక్కరలేదు. దయయుంచి మీరుహాయిగా తిని కూర్చోండి. మీరు ఏమీ చెయ్యొద్దు. నా మాట వినండి. మీరు ఏమీ చెయ్యకుండా ఉండటమే నాకు కావలసింది. నాకు భయం ఎక్కడ వేస్తోందంటే మీరు సాధనలు చేసి కర్తృత్వం దగ్గరకి వెళ్ళిపోతున్నారు. ఇంకా పురాణాలలో ఈ పూజ చేసుకోండి. ఈ పూజ చేస్తే ఈ ఫలితం వస్తుంది అని చెప్పారు. ఫలితాన్ని విడిచిపెట్టమని భగవంతుడు చెప్తూంటే మళ్ళీ అక్కడే పక్కనే ఆఖరు పేజీలో ఏ శ్లోకం చదివితే ఏ ఫలితం వస్తుందో, ఏ అధ్యాయం చదివితే ఏ ఫలితం వస్తుందో చెప్తారు. ఏమిటి ఇదంతా అంటారు. ఫలితాలు ఎందుకు పెట్టారంటే, చదువుకొనే పిల్లలకి, నేను చదవను అంటే, నీకు బెల్లంముక్క పెడతాను అంటాం. అల్లరిపిల్లల కోసం చెప్పే మాటలు ఇవి. ఏదో లంచం ఇవ్వాలి వాళ్ళకి. భగవంతుడు మీకు ఫలితం ఏదో చూపిస్తే కానీ చదవరని అక్కడ పెట్టాడు. అంతేకానీ అది సహజస్థితి కాదు. చూడటానికి ఇది పరస్పర విరుద్ధంగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఫలితం అంటే ఏదో ఒకలాభం వస్తుంది అని. అంటే వచ్చే జన్మలో ఇంకా ఎక్కువ సుఖపడవచ్చు అని. అంటే ఆజన్మకాజన్మ మనం స్వార్ధపరుల మవ్వాలని మనకి తెలియకుండా మనం కోరుకుంటున్నాం. జ్ఞానవంతులం అవ్వాలని కోరుకోవటం లేదు. మీరు పూజచేస్తే ఈ ఫలితం వస్తుంది. అంటే ఆ ఫలితం కోసం నేను ప్రయత్నం చేస్తుంటే మళ్ళీ నేను ఇంకా ఎక్కువ స్వార్ధపరుడ్ని అవ్వటంకోసం నాకు తెలియకుండా నేను ప్రయత్నం చేస్తున్నాను. అంటే జ్ఞానానికి దూరం

అయిపోతున్నాను. అందుచేత సాధనలు కాసేపు ఆపుచెయ్యండి. ఏముందండీ సాధనచేయటానికి. ఎంత జాగ్రత్తగా మాట్లాడితే అంతమంచిది. కూర వండేటప్పుడు ఉప్పకారాలు ఎంత వెయ్యాలో జాగ్రత్తగా కొలిచివేస్తారు. చేతికి ఎంతవస్తే అంత వెయ్యరు. మరి మాట్లాడేటప్పుడు కొలత అక్కరలేదా మనకి? నోటికి వచ్చినట్టు మాట్లాడెయ్యటమేనా? ప్రతీ జీవుడికి దుఃఖం వస్తోంది. మనకి దుఃఖం ఎందుకు వస్తోంది. దేహం నేను అనే భావన పోవటంలేదు. ఈ దేహం నాది అని రోజూ అనుకొంటున్నాము. మరి నాది అయినప్పుడు నన్ను విడిచిపెట్టి స్మశానానికి ఎందుకు వెళ్ళిపోతోంది. ఎంతసేపూ మీరు దగా చేస్తున్నారని ఏడుస్తున్నానే కానీ నా దేహం చేస్తోందని ఏడవను ఎందుకు? మరి నా దేహం నన్ను దగా చేస్తోందికదా. దేహాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకొంటున్నాము. రోజు రెండుపూటలా స్నానం చేయిస్తున్నాము. అన్నం నేతి ఇడ్లీలు పెడ్తున్నాము. ఎంత చాకిరీ చేస్తున్నాము దీనికి. మనం దేహం కేంద్రంగా జీవిస్తున్నామా? లేకపోతే జ్ఞానం సంపాదించటం కోసం జీవిస్తున్నామా? ఈ దేహాన్ని బాగా పోషించుకోవచ్చని చదువు కొంటున్నాం. చదువు పెద్దమాయ. పొద్దున్న ఒక అరగంట సాయంత్రం ఒక అరగంట పూజ చేసి ఏంటి మీరు చేసే సాధన? లోపల అసలు ఉద్దేశం ఏంటి? విషయం కనుక మీకు అర్థం కాకపోతే ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు. నా మాట వినండి. విషయం కనుక మీ మనస్సుకి. మీ బుద్ధికి అందకపోతే సాధనవల్ల మీరు ఏమీ సాధించలేరు. ఈ సాధనలు నీకు దారి చూపించటానికి ఉపయోగపడాలా లేకపోతే దేహం నేను అనే భావన ఎక్కువ అవ్వటానికి ఉపయోగపడాలా? శాస్త్రాలు అన్నీ కూడా, మన గోపాలస్వామి చెప్పినా, ఎవరు చెప్పినా మనస్సుని జయించటానికే. ఇవ్వాళ ఉన్న ఆలోచన రేపు ఎందుకు ఉండటంలేదు? రేపు ఉన్న ఆలోచన ఎల్లుండి ఎందుకు ఉండటంలేదు. ఇంక ఏం జయిస్తాం దీనిని? శరీరం వచ్చిన తరువాత ఎన్ని తలంపులు వచ్చాయో? ఇందులో ఏ తలంపు నిజం? దేహం నాది అని చెపుతున్నారు. ఈ దేహం నేను అని ఎవరు చెప్తున్నారు. మనం బయటకు చూడటం నేర్చుకున్నాం. వంద సంవత్సరాలు వచ్చినా బయట చూడటానికి అలవాటు పడిపోయాం. లోపలికి దిగటం లేదేమిటి. లోపలి చూపు ఎందుకు రావటం లేదు. లోకాన్ని మీరు మరమ్మత్తు చేస్తారా? మీరు పుట్టకముందు కూడా లోకం ఉందా లేక మీరు పుట్టినతరువాత లోకం వచ్చిందా? ఈ జిన్నూరు ఉంది, మనం పుట్టకముందు జిన్నూరు ఉందా, లేకపోతే మనం పుట్టినతరువాత జిన్నూరు పుట్టిందా? జిన్నూరుని మీరు మరమ్మత్తు చేసేస్తారు ఇప్పడు. తరువాత ఎవరు మరమ్మత్తు చేస్తారు? ఇదంతా పెద్ద గారడి! అసలు నిజంగా సేవ చేసేవాడికి నేను సేవ చేస్తున్నాను అన్న భావనే వాడికి రాదు. సేవ చేస్తున్నాను అన్న తలంపుకూడా రాదు. సేవ చేస్తున్నాను అని అసలు వాడికి తెలియదు. తెలిస్తే అక్కడ అహంకారం వచ్చేసినట్టే మనస్సు వచ్చేసినట్టే.

మనకి భోగం కావాలి. డబ్బు సంపాదించినా చదువుకున్నా ఏ పని చేసినా భోగం కోసమే. భోగంతోపాటు మనకు కీర్తి కూడా కావాలి. పెరుగుఅన్నంలో పచ్చిడిలాగా అది మళ్ళీ అడిషనల్ అన్నమాట. మళ్ళీ ఈ దరిద్రానికి ఆ దరిద్రం ఒకటి సాయం. మనం ఎక్కడెక్కడ తిరిగినా మళ్ళీ మన దేహం దగ్గరకి వచ్చేస్తున్నాం. ఇంజనీరింగు డాక్టరు ఏ కోర్సులు చదివినా మళ్ళీ మన దేహం దగ్గరకి మనం సిద్ధం. దీని డెస్టినేషన్ ఏంటంటే మళ్ళీ తన దేహమే. దేహం నేను అనే భావన మీలో పోకపోతే కోటి జన్మలు ఎత్తినా ఇంతే

మనం. కోటిజన్మలు ఎత్తండి, మీరు కోటి సార్లు భగవద్గీత చదవండి. కోటి వ్రతాలు చేయండి. కోటి పూజలు, జపాలు చేయండి, వెళ్ళి నదులలో మునగండి. ఈ దేహం నేను అనే భావన పోనంతకాలం, ఈ అజ్ఞానం ఈ ప్రకృతి మనని విడిచిపెట్టదు. మనకు చావు అంటే భయం వేస్తోంది. నిద్ర అంటే ఎందుకు భయం వెయ్యటంలేదు. అంటే ప్రొద్దునే లేచి మళ్ళీ కాఫీ తాగొచ్చు అని. నిద్దట్లో మీ దేహం కనిపిస్తోందా? నేను చాప మీద పడుకున్నాను. మంచం మీద పడుకున్నాను. జిన్నూరులో ఉన్నాను అని చెప్తోందా? నిద్రలో మగవాళ్ళు ఎవరైన మేము మొగవాళ్ళం అనుకుంటారా? ఎందుకు అనుకోవటంలేదు. నిద్రలో దేహం కనబడటంలేదు. స్మశానంలో తగలబెట్టినప్పడు కూడా దేహం కనబడటంలేదు కదా. మరి దానికి ఎందుకు భయపడుతున్నారు. దీనికి ఎందుకు భయపడటంలేదు. నిద్రలోకూడా మీకు దేహం కనబడదు. అది అబద్ధమా? మరి హేతువాదం మాట్లాడాలి కదా. హేతువాదం మాట్లాడకపోతే ప్రమాదం కదా. కృష్ణుడు చెప్పాడు. రాముడు చెప్పాడు అనే మాటలు మూటకట్టి కాసేపు ఓ ప్రక్కన పెట్టండి. మీ అనుభవంలోంచి రానివ్వండి. మాకు దేవుడు కనిపించాడు. మాకు ఈ అనుభవాలు వచ్చేసాయి, ఆ అనుభవాలు వచ్చేసాయి. ఇవన్నీ అబద్ధాలు. దేవుడిని ఎవరితో చూస్తారు మీరు? మనస్సుతో చూస్తారు. మనస్సు అబద్ధం అని చెపుతూ ఉంటే ఇంక దేవుడిని చూడడం ఏమిటండీ అసలు? మనస్సు చూసేది వినేది అబద్ధం అని చెప్తూంటే ఇంక దేవుడినేమి చూస్తారు? మీరెవరో మీరు తెలుసుకోకుండా భగవంతుడు ఎవరో మీకు తెలియదు. భగవంతుడు ఎవరో తెలుసుకోకుండా మీరెవరో మీకు తెలియదు. భక్తుడు భగవంతుడి వెనకాల వెళ్తాడు. జ్ఞాని ఈ నేను ఎక్కడ పుట్టింది అని తిరుగుతాడు. అందుకే గీతలో భగవంతుడు జ్ఞానయోగం, భక్తియోగం, కర్మయోగం ఇవన్నీ పెట్టాడు. మనస్సు యొక్క ప్రవృత్తిని బట్టి ఇవన్నీ కల్పించాడు. కొంతమంది ఈ నేను గురించి కొంతసేపు చెప్పకండి బాబూ. కొంతసేపు భగవంతుడి గురించి చెప్పండి అంటారు. ఈ నేను అంటే భయం వేస్తోంది అంటారు. నిజమే పాపం వాళ్ళ ప్రవృత్తి అటువంటిది. ఇదంతా మనస్సు కల్పించేదే. ఈ నేను ఎవరు, భగవంతుడు ఎవరు, అంటే వాళ్ళు కంగారు పడతారు. పెద్దపెద్ద చదువులు చదువుకున్నా వాళ్ళుకూడా అయ్యబాబోయ్ ఈ నేను గొడవ ఎత్తకండి భయం వేస్తోంది అంటారు. వాళ్ళు భక్తులే, భగవంతుడి గురించి చెప్పండి. కృష్ణుడి గురించి రాముడి గురించి చెప్పండి. అబ్బో కృష్ణుడు ఎంత గొప్ప పనులు చేసాడు అంటారు. ఇక హేతువాదులు రామాయణం అబద్ధం, భారతం అబద్ధం అని చెప్పకుంటారు, ఈ భక్తులు మూర్ఖత్వంలోపడి ఉన్నారని అనుకొంటారు.

మనం చుట్టాలు వచ్చినప్పడు బట్టలు అవీ సర్దుకుని జాగ్రత్తగా ఉంటాం. చుట్టాలు లేనప్పడు ఎలాపడితే అలా ఉంటాం. చుట్టాలి ఇంటికి వెళ్ళినప్పడు చొక్కా అవీ సర్దుకొంటాం. ఏమైనా అనుకుంటారేమో అని. ఎంతసేపూ ఎదుటివాళ్ళకోసం ఎదుటివాళ్ళు ఏమనుకొంటారో నని బ్రతికేబ్రతుకు మనది. మనకి జ్ఞానం ఏంటండీ. ఎదుటివాళ్లు అందరూ మనని మంచి అనుకోవాలి. అందుకే బ్రతకాలి అనుకొంటే ఆ బ్రతుక్కి ఇంక జ్ఞానం ఎలా వస్తుంది. ఎదుటివాళ్ళ మీద ఆధారపడి జీవించటం, ఎదుటివాళ్ళు ఆలోచన ఆధారంగా జీవించటం ఏంటి? సొంత ఆలోచన లేని మనిషి వాడు ఎంత కోటీశ్వరుడైనా జంతువుతో సమానం. సొంత ఆలోచన లేని భక్తుడి కంటే, సొంత ఆలోచన ఉన్న హేతువాదిని నాస్తికుడిని నేను

మెచ్చుకొంటాను. ఎదుటివాడి ఆలోచనమీద కేవలం ఆధారపడి ఉన్నవాడు బాగుపడడు. ఎన్ని తప్పలు చేసినా సరే స్వతంత్రమైన ఆలోచన ఉన్నవాడు ఎప్పటికైనా సరే బాగుపడతాడు. తన సొంతబుద్ధి ఉన్నవాడు సొంత ఆలోచన ఉన్నవాడు, వాడు తప్పలు చేసినా సరే వాడు ఎప్పటికైనా బాగుపడితీరతాడు.

ఎదుటివారి మీద ఆధారపడి ఎంతకాలం బ్రతుకుతారు. మాట్లాడితే, ఇలా అంటే ఏమనుకుంటారో అలా అంటే ఏమనుకొంటారో, ఇలా ఎంతకాలం నేను బ్రతకాలి. నేను గాలి పీల్చుకోనక్కరలేదా ఇంక? మీమీద ఆధారపడి నేను జీవించటం ఏంటండీ? పోనీ ఎంతకాలం, ఒక రోజా, రెండు రోజులా, నేను బ్రతకడం. నూటికి తొంభై మంది మనుషులకి సొంతబుద్ధి ఉండదు. ఆధ్యాత్మిక జీవితానికి వాళ్ళు అసలు పనికిరారు. అసలు ఆ ఆలోచన తెలియదు వాళ్ళకి. ఎవరైనా చూస్తే ఏమైనా అనుకొంటారేమో. ఇటువంటి ఆలోచనలు వచ్చాయి అనుకోండి. మీకు లోపల విపరీతమైన పిరికితనం ఉన్నట్టు గుర్తు. మీకు జ్ఞానం కావాలా, ఎవరైనా ఏమైనా అనుకొంటారేమో మీకు కావాలా? అన్నం మీ కోసం తింటున్నారా ఎదుటివాళ్ళకోసం తింటున్నారా? ఒక ఇంగ్లీషు కవి చెప్పాడు, చాలామంది అన్నం వాళ్ళకోసమే తింటారట, బట్టలు ఎదుటివాళ్ళకోసం కట్టుకొంటారట. సర్వసాధారణంగా బట్టలకొట్లో చూస్తాం, ప్రక్కవాళ్ళని అడుగుతారు బాగుందా అండీ అని. కూర తినేటప్పడు తనకిష్టమైనదే తినేస్తాడు. ఎదుటివాళ్ళని అడగడు బాగుందా అని. బట్టల విషయంలో మటుకు ఎదుటివాళ్ళకి బాగుంటుందో లేదో చూసుకుంటారు. మీకు నచ్చిన కూర నేను తినలేను, కానీ మీకందరికీ నచ్చిన బట్ట నాకు కట్టుకోవాలనిపిస్తుంది.

భగవాన్‌ని ఒక హేతువాది ఏమండీ రామాయణం, భారతం జరిగాయి అంటారా అన్నాడు. వీడు తెలివైన వాడు, అబద్ధం అని చెప్పకుండా అలా అడిగాడు. వీడు ఏదో చదివాడు. అది ఊరికే పోదు కదా! రామకృష్ణ పరమహంస అయితే కోపం వచ్చి ఏదో వాదనలోకి దిగి ఏదో చెప్పేవాడు, రామాయణాన్ని భారతాన్ని ఇలా అంటావా అని. కానీ ఈ హేతువాది కంటే మొండి భగవాన్. గోచీ పెట్టుకొని ఆయన కూర్చుంటే, మనందరం ఆయనని చూసి అనుకొనేది ఏంటి? రామాయణం భారతం జరిగాయా స్వామీ అంటున్నాడు వాడు. ప్రశ్న ఎంత లౌక్యంగా వేసాడో చూడండి. అబద్ధం అని వాడి ఉద్దేశం. రామాయణం భారతం అసలు జరిగినా అబద్ధం అని నేను చెపుతూ వుంటే జరిగినాయా అంటావేంటి అన్నారు భగవాన్. అసలు జరిగినా అబద్ధం అని చెప్తున్నాను, జరిగిందా లేదా అని నువ్వు వాదిస్తావేంటి? అంతే నోరు పడిపోయింది వాడికి. అనవసర విషయాలు ఆలోచించకండి. ఒకటి గ్రహించటం లేదు మీరు. భయం వల్ల మన ప్రాణశక్తి ఖర్చు అయిపోతోంది. మీరు ప్రతిదానికి భయపడితే మీ ప్రాణశక్తి ఖర్చు అయిపోతుంది. డబ్బు అనవసర విషయాలకి ఖర్చు పెడితే ఎలా ఉంటుందో, మీ ప్రాణ శక్తిని కూడా అలా ఖర్చు పెట్టకూడదు. కొంతమందికి అన్ నెససరీ థాట్స్ వస్తాయి.

మా కోరికలు ఈ మధ్య బాగా నెరవేరుతున్నాయని కొందరు అంటుంటారు. కానీ ఈ కోరికలు నెరవేరటం వల్ల ఎన్ని కష్టాలు కనిపెట్టుకొని ఉన్నాయో వాళ్ళకి తెలియదు. వేంకటేశ్వరస్వామి దయవల్ల నా కోరికలు నెరవేరిపోతున్నాయి అనుకుంటారే కానీ ఆ కోరికలు నెరవేరటం వల్ల ఎన్ని కష్టాలు కనిపెట్టుకొని ఉన్నాయో వీడికి తెలియదు. అది వీడి బుద్ధికి

అందదు. పంచదార నోట్లో వేసుకుంటే తియ్యగా ఉంటుంది. మరి తియ్యదనం ఎలా ఉంటుంది అంటే మీరేం చెప్తారు? మీరు కూడా నోట్లో వేసుకొని చూసుకోండి మీకే తెలుస్తుంది. మేమేం చెప్తాము అంటారు. ఆమాత్రం చెప్పలేకపోతున్నారు. ప్రాణశక్తి అనవసరంగా ఖర్చు పెట్టేస్తున్నారు. మన మనస్సులో, శరీరంలో ఉన్న బలం పోతోంది. ప్రాణంలో ఉన్న బలం కూడా పోతోంది. మన ప్రాణశక్తిని అనవసరంగా ప్రతిదానికి ఖర్చు పెట్టేసుకొంటున్నాము. అందుకే బలహీనపడిపోతున్నాము. మీ ప్రాణశక్తి ఆత్మవైపు తిరిగితే మీకు తెలియకుండా కోరమండల్ ఎక్స్ప్రెస్ ఎంత స్పీడుగా వెళ్తుందో, అంతకంటే వేగంగా మీరు ఆత్మవైపు కొట్టుకుపోతారు. మీరు ప్రాణశక్తిని కనుక కంట్రోల్ చేసుకుంటే, వృధా అవ్వకుండా చూసుకుంటే, అంత స్పీడుగా ఆత్మవైపు వెళతారు. ప్రయత్నం చేస్తూ, నేను ప్రయత్నం చేస్తున్నాను, సాధన చేస్తున్నాను అని లెక్కపెట్టుకొంటూ ఎంతసేపు చెయ్యగలరు. అలా ఆత్మని తెలుసుకొందాం అనుకొంటున్నారా? మీరు పచ్చగడ్డి దూడకి చూపించండి. నువ్వు పచ్చగడ్డి తిను అని దూడకి చెప్పనక్కరలేదు. పచ్చగడ్డి చూస్తే అదే వచ్చేస్తుంది. ఆత్మ దగ్గరికి మీరు అలా వెళ్ళాలి. వెళ్ళటానికి దాని విలువ మీకు తెలిస్తే కదా! వస్తువు విలువ తెలియకుండా వస్తువు సంపాదించాలనే బుద్ధి పుట్టదు కదా! డబ్బు, చదువు, గౌరవం, విలువ తెలుసు కాబట్టి అవి సంపాదించుకొంటున్నారు. ఆత్మ విలువ తెలియదు కాబట్టి దానిని సంపాదించటం లేదు. మీ తప్పేమీ కాదది. ఆత్మ యొక్క విలువ తెలియకుండా ఆత్మ వైపు ఎలా ప్రయాణం చేస్తాం? ఆత్మ లేకుండా కృష్ణుడు ఉన్నాడా, ఏసుక్రీస్తు ఉన్నాడా, హనుమంతుడు ఉన్నాడా, దుర్గ ఉందా? మీ ఇష్టదైవం ఎవరైనా ఆత్మ లేకుండా ఉందా? కృష్ణుడు, రాముడు వాళ్ళ దేహమే కనుక నిజమైతే వాళ్ళ దేహాలు ఇప్పుడు ఎందుకు లేవు. ఆత్మని తెలుసుకోవటం, గ్రహించటం, అంటే ఆత్మని అనుభవంలోనికి తెచ్చుకోవటమే. మీరు దేహంలో చాలా సుఖాలు అనుభవించి ఉంటారు. ఆత్మ సుఖం ఒక్క సెకను అనుభవించిన వాళ్ళు ఇక్కడ ఎవరైనా ఉన్నారా? ఒక సెకను అనుభవిస్తే తెలుస్తుంది ఆత్మ సుఖం ఎట్టిదో. ఆత్మ తప్పించి ప్రతీదీ జడ వస్తువే. ఆత్మ ఒక్కటే చైతన్య వస్తువు. అయితే మీకు ఆత్మ గురించి చెప్పేవాళ్ళు ఎవరైనా ఉన్నారా? ధర్మరాజు తమ్ముడు భీముడు అని ఇటువంటి మాటలు ఎన్నాళ్ళు చెప్పకుంటారు? కాలం కూడా మనం కల్పించుకున్నదే. నాలుగైందా, రెండయిందా, అని ఇప్పుడు చూసుకుంటాం. మరి నిద్రలో ఏం చూసుకుంటున్నాం? బెంగ పెట్టుకుంటే రోజులు వెళ్ళవు. సంతోషంగా ఉంటే నెలలు రోజుల క్రింద వెళ్ళిపోతాయి. మరి కాలాన్ని మనస్సు కల్పించలేదా? నేను చెప్పిన మాటలని మీరు నమ్మొద్దు. మీ అనుభవంలో చూసుకోండి. నేను చెప్పిన మాట మీ అనుభవంలో చూసుకొని మీ సొంతం చేసుకోకపోతే మీరు వినటం వల్ల ప్రయోజనం లేదు. ప్రతిదీ మీరు బ్యాలన్స్ చేసి చూసుకోండి. వంకాయల తూకం కాదు ఇది. వంకాయలు ఒక కాయ అటూ ఇటూ వేసేస్తారు. బంగారం తూకం చాలా జాగ్రత్తగా చూసుకొంటారు. ఒక కాసు బంగారం తూకం వెయ్యమన్నాము అనుకోండి జాగ్రత్తగా చూసుకొంటాడు. అటూ ఇటూ గెంటేయడు. అటూ ఇటూ గెంటేస్తే ఒక అరకాసు బంగారం తేడా వచ్చేస్తుంది. వంకాయలు, బీరకాయలు, త్రాసులా కాదు. బంగారం తూసే వాడు ఎలా తూస్తాడో అలా బ్యాలన్స్ చేసుకోండి నా మాటని. మీ అనుభవానికి సరిగ్గా సరిపోతోందో లేదో చూసుకోండి. మీరు ఇంటి దగ్గర విచారంగా ఉన్నప్పుడు ఆ రోజు ఎలా వెళ్తోంది. సంతోషంగా ఉన్నప్పుడు ఎలా వెళ్తోంది చూసుకోండి.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | |
|---|---|---|
| ఆగష్టు | 22 | మధ్యాహ్నం గం॥ 2-00ల నుండి హైదరాబాదు రాజేశ్వరిగారి ప్రవచనం |
| సెప్టెంబర్ | 1 | మధ్యాహ్నం గం॥ 2-00ల నుండి అమలాపురం మాష్టారు ప్రవచనం |
| సెప్టెంబర్ | 2 | మధ్యాహ్నం గం॥ 1-00ల నుండి శ్రీకృష్ణ జన్మాష్టమి - దంతులూరి పెద్దిరాజు గారి ప్రవచనం |
| సెప్టెంబర్ | 23 | మధ్యాహ్నం గం॥ 1-00ల నుండి శ్రీ నాన్నగారి జయంతి - డా॥ ఉష గారి ప్రవచనం |

**SRI RAMANA KSHETRAM** A/c. No. **510101006497273**
**CORPORATION BANK, PALAKOL Branch**
IFSC Code : **CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై** ఫోన్ : 04175-236174
**For Accomodation : 9849124502, 7780639977, 9949948595**

**మీ 'రమణ భాస్కర' చందా గడువు ఆగష్టు నెలతో ముగుస్తున్నది. కావున రెన్యువల్ చందాను స్వయంగా జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంనందు చెల్లించి రశీదు పొందగలరు.**

## ఊరకే ఉండు

నీ స్వరూపమే సుఖం, నీ స్వరూపమే ఆనందం అంటారు భగవాన్ శ్రీరమణ మహర్షి. పుట్టని సుఖము, శాశ్వతమైన సుఖము, స్వతంత్రమైన సుఖము, మన స్వరూపంగానే ఉంది. కాబట్టి అట్టి సుఖము లేదా శాంతి 'తాను'గా అనుభవైకవేద్యం కావాలంటే "ఆత్మనిష్ఠుడిగా ఉండు" అనగా "నీవు నీవుగా ఉండు" "ఊరక ఉండు" అంటారు భగవాన్. ప్రపంచంలో అనేక విద్యలు ఉన్నాయి. ఎలాంటి విద్యనైనా శ్రద్ధ పెడితే సులభంగా నేర్చుకోవచ్చు, కానీ "ఊరక ఉండే విద్య" అనగా మనస్సును ఊరక ఉంచే విద్య, చాలా కష్టమైనది. "ఊరక ఉండు" అంటే అహంకారం లేకుండా ఉండు మరియు కర్తృత్వబుద్ధి లేకుండా ఉండు అని అర్థం. 'తాను' 'తాను'గా ఉంటే, శాశ్వత ఆనంద స్వరూపుడే 'తాను' అవుతాడు. అట్లుగాక బాహ్యమునుండి సుఖాన్ని ఆశిస్తే, అది అశాశ్వతము, భ్రాంతియే కాబట్టి పరిణామములో దుఃఖముగా మారిపోతుంది. ప్రపంచము దృష్ట్యా చూస్తే ప్రపంచానికి ఆధారము బ్రహ్మమే! ఆత్మ దృష్ట్యా చూస్తే ప్రపంచమే లేదు, ఆత్మయే జగత్తుగా గోచరిస్తోంది. "అహంకారాన్ని వదిలించుకోవడమే సత్య సాక్షాత్కారానికి సూటిమార్గం. అహంకారానికి ఆత్మను విడిచి ఉనికిలేదు, కనుక దాని నిజ స్థితిని విచారించగానే, అది అంతర్థానమై సత్యము దానంతట అది ప్రకాశిస్తుంది." అన్నారు భగవాన్ శ్రీరమణులు. ఏమార్గాన్ని అనుసరించినా, గురువు ఎవరైనా 'మనోనాశనం' ముఖ్యం. మనస్సు నశించకుండా బ్రహ్మానుభూతి కలుగదు. లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసనల నుండి పూర్తిగా విడుదల పొందాలి. త్రికరణాలను మోక్ష ప్రాప్తికి మార్గంగా మలచుకోవడం మన చేతిలోనే ఉంది. ఆధ్యాత్మిక బలాన్ని పెంచుకోవాలి. అది మనను ఎల్లవేళలా కవచంగా కాస్తుంది. తత్త్వజ్ఞానం కలగాలంటే మనోనాశనం జరగాలి. మనోనాశనం జరగాలంటే, వాసనాక్షయం కావాలి. దేహాత్మబుద్ధిని అతిక్రమించి, ఆత్మలాభమును పొందుటకు, శాశ్వతమైన శాంతిని తానుగా అనుభవైక వేద్యం చేసుకొనుటకు, ఈ మానవ జన్మే పట్టు కొమ్మ.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# అంధకారంలో మార్గదర్శనం చూపే వెలుగే - దైవీ ప్రేమ

ఆశలు ఉడిగినప్పడు సహాయకులు వదిలేసినప్పడు నేటిమిత్రులు రేపు శత్రువులు అయినప్పడు, నమ్మినవారు నట్టేట ముంచినప్పడు, తన బిడ్డే తనను కాదన్నప్పడు ఎటునుంచో సహాయం అందుతుంది. దానికి గురువును ప్రేమించటంలో వివేకం, వినయం, ఆయనకు ఆత్మార్పణం చేసుకోవటంలోను మరియు అన్నింటిలోనూ ఆయన ఉన్నారని తెలుసుకోగలము. గురుస్తుతి, ఉపాసన, ప్రార్థన ఇవి గుడ్డి నమ్మకాలు కావు. అవి ఆహార విహారాలకన్నా అత్యధికమైన సత్యాలు - భార్య భర్తను, భర్త భార్యను వాడుకుంటుంది. పిల్లలు తల్లిదండ్రులను వాడుకుంటారు. తరువాత తల్లిదండ్రులు వృద్ధాప్యంలో పిల్లలను వాడుకొంటారు. దీనిని మనం ప్రేమ అంటాము. భార్య కొరకు ఎవ్వరూ భార్యను ప్రేమించటంలేదు. ఆమెలో ఉన్న ఆత్మ కొరకే అర్థాంగిపై ప్రేమ క్రింద మెట్టుగల ప్రేమ. 'అంగిని' ప్రేమించటంలో అంగముల ప్రేమ కూడా ఉంది. అలాగే భార్య భర్తను ప్రేమించటం కూడా ఇమిడి ఉంది అని మనం గ్రహించాలి. ప్రేయసి అని భార్యను లాలిస్తాము, ఆమె జబ్బుపడి అందచందాలు పోయి వికృతరూపం ధరిస్తే అనురాగం సన్నగిల్లుతుంది. ఆ ప్రేమ, వంచన మిధ్య మనలను పీడించేది ఒకటి ఉంది. అసలు వస్తువును ఎందుకు కనుక్కోలేకపోతున్నామో తెలియదు. మాటిమాటికి పొరపాట్లను గుర్తిస్తాము. చివరకు కళ్ళు తెరుస్తాము, వెలుగు అయిన ప్రేమ గోచరిస్తుంది. గురు రూపంలో ఉన్న ఈశ్వర ప్రేమను పానము చేతనే భయరోగాలు మాయమవుతాయి. ఈ విషయంలో మనం దైవోన్మత్తులమైతే మనం మనుషులమన్న విషయం మర్చిపోతాము. నేను నిన్ను ప్రేమిస్తున్నాను అంటే మిగిలిన వారి సంగతి ఏమిటి? ఈ చరాచర దృష్టి విషయం మాట ఏమిటి? ప్రేమ బంధం కాకూడదు, చాలా విశాలంగా, విస్తృతంగా వుండాలి. ప్రేమ మనదే అది మన స్వరూపం కావాలి. ప్రేమ అనేది ఒక అనుబంధం కాదు. ప్రేమ మన 'ఉనికి' యొక్క స్థితి. మనం ప్రేమమయులైనప్పడు పర్యవసానంగా అది జరుగుతుంది. ప్రేమను అర్థం చేసుకోవలసింది ఒక శరీర అంగ ఆకర్షణ కాదు అది స్మశానంలో కాలిపోతాయి అది జంతువుల్లోను ఉంటుంది. అందులో ఏ ప్రత్యేకతా లేదు. మనం మొదట గుర్తించవలసింది కామానికీ - ప్రేమకు మధ్య స్పష్టమైన విభజన రేఖను ఏర్పాటుచేసుకోవాలి. కామం గుడ్డి ఆకర్షణ ప్రేమ మౌనంలోంచి జనించే దివ్య సుగంధ పరిమళం. దేవుడు ప్రేమ మయుడు కాదు ప్రేమే దేవుడు. ఇది పదాల గారడీ కాదు. ప్రేమ లేకపోతే తత్వశాస్త్రం వట్టి ఎముకల గూడు ప్రేమ ఉన్నచోట ఉచ్ఛనీచాలు ఉండవు. మన జీవితాల్లో ఎలాంటి పరిస్థితులు తారసపడినా ప్రేమ దాన్ని మధురం చేస్తుంది. "ఇది కూడా తొలగిపోయేదే" అని దాన్ని మధురం చేస్తుంది. సర్వ కష్టాలకు సర్వ నష్టాలకు మూలం ఇది నాది అనుకొనే అహంకృతే ప్రేమించేటప్పడు వేదన నరకం ఎక్కడ ఉంటుంది. మనపై వచ్చే విమర్శలను ప్రేమ అనే వివేకంతో చిన్నది చెయ్యాలి. జీవిత సంగ్రామంలో గెలిచేది ప్రేమే. మనం అనుకొనే దుఃఖం దుఃఖం కాదు మనం అనుకొనే భాగ్యం భాగ్యం కాదు. దేవుని మర్చిపోవటమే దుఃఖం. ఆయన్ని నమ్మటమే భాగ్యం. దేవుడు సర్వాంతర్యామి అని మనకు తెలిసినా తెలియకపోయినా ఆ దివ్య ప్రేమ మనలో ఉంది. అది గురువును ఉపాసన చెయ్యటం వల్ల లభ్యమవుతుంది. అంతే.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966